క్లుప్తంగా

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన సున్నం లక్ష్మణరావు, సునీత దంపతులు రూ.51,116 విరాళం అందించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వాటర్ కూలర్ బహూకరణ



రాజులపాలెం సచివాలయానికి వాటర్ కూలర్ బహూకరిస్తున్న గోపీనాథ్

పి.గన్నవరం: రాజులపాలెం గ్రామ సచివాలయానికి స్థానిక ఆక్స్‌ఫర్డ్, కెనడీ కాన్వెంట్ హైస్కూలు అధినేత అర్.గోపీనాథ్ బుధవారం రూ.25 వేల విలువైన వాటర్ కూలర్‌ను బహూకరించారు. గోపీనాథ్ గతంలో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించారు. సొసైటీ మాజీ చైర్మన్ గుత్తుల చంటి, చిన్నం నాగేశ్వరరావు, ఉయ్యూరి సాయిరాజు గ్రామ సచివాలయానికి మూడు ఇనుప బీరువాలను బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు, సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, జల్లి పండు, బండి రమేష్, పుచ్చకాయల నర్సింహమూర్తి, కొంబత్తుల చంద్రశేఖర్, గుడాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం సీఐగా రామ్‌కుమార్



రావులపాలెం: రావులపాలెం సీఐగా ఎం.రామ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రజినికుమార్‌కు పెనుగొండ బదిలీ కావడంతో, ఆ స్థానంలో విజయవాడ సీసీఎస్ సీఐగా ఉన్న రామ్‌కుమార్ బదిలీపై రావులపాలెం వచ్చారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

సఖినేటిపల్లి: అంతర్వేదికరకు చెందిన ప్రముఖ దాత, డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ 83వ జయంతిని కుటుంబ సభ్యులు, అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సైకిల్‌షాపు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి, కేశవదాసుపాలెం కాలువమొగలో ఆయన ఫ్లెక్సీకి కుమారుడు, మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్‌తో పాటు అభిమానులు నివాళులర్పించారు. సమాజానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. అనంతరం నాగేంద్రకుమార్ ఆయా గ్రామాల్లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు, పెన్నులు కూడా అందజేశారు.

ఘనంగా కందుకూరి జయంతి

ఆత్రేయపురం: కవి, గేయ రచయిత, మహాత్మా గాంధీ విద్యా సంస్థల తొలి ప్రధానోపాధ్యాయుడు కందుకూరి రామభద్రరావు జయంతిని స్థానిక మహాత్మా గాంధీ విద్యాసంస్థల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్, సెక్రటరీ పీఎస్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. విద్యా సంస్థలు స్థాపించిన తొలినాళ్లలో సంస్థ అభివృద్ధికి కందుకూరి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రిన్సిపాల్ బీవీఆర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సత్యనారాయణ బదిలీ

అంబాజీపేట: ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కె.సత్యనారాయణమూర్తి బుధవారం బదిలీ అయ్యారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా ఆయనను విశాఖ జిల్లాకు బదిలీ చేశారు.

సర్వేను త్వరగా పూర్తి చేయాలి

అంబాజీపేట: కులగణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి కోరారు. మండలంలో ఈ సర్వేను బుధవారం పరిశీలించారు. ఇప్పటికే 89.58 శాతం సర్వే పూర్తయ్యిందని, మిగిలిన 10.42 శాతం త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ఇంట్లో చోరీ

ఆత్రేయపురం: ర్యాలి శివారు బుల్లియ్యరేవు వద్ద ఓ ఇంట్లో చోరీ జరిగినట్టు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన చొల్లంగి బంగారయ్య ఇంట్లో బుధవారం ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. మూడు కాసుల బంగారం, రూ.25 వేల నగదు, 20 తులాల వెండి పట్టీలను దొంగలు అపహరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం జగన్

- ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- అంకంపాలెంలో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత



అంకంపాలెంలో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు ఇస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉందని, మళ్లీ అధికారంలోకి వచ్చి ఎనలేని సంక్షేమాన్ని అందిస్తామని ఎంపీ చింతా అనురాధ, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అంకంపాలెంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గారపాటి అబ్బులుచౌదరి, గారపాటి గంగారామ్‌చౌదరి, కరుటూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణమాఫీ చేశారన్నారు. పెన్షన్ రూ.3 వేలు చేశారని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని వివరించారు. కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 17 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. అమ్మ ఒడి, వసతి దీవెనతో ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చిన జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఖర్చులతో ఆడపడుచులకు విందు ఏర్పాటు చేశారు. లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యామ్‌సన్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగర్రాజు, ఎంపీడీఓ నాతిబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఊబలంకలో సచివాలయం ప్రారంభం

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఊబలంక గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం–1 భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ కొక్కిరగెడ్డ లక్ష్మి, ఎంపీటీసీ మల్లిడి లావణ్య, శివ, మాజీ ఎంపీటీసీ మల్లిడి రామిరెడ్డి, కర్రి వీర్రెడ్డి, వార్డు సభ్యులు, సెక్రటరీ బూసిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా జగన్ కృషి

ఆలమూరు: కులమత వర్గాలకతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మడికి, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ, పెనికేరు, పినపళ్ల గ్రామాల్లో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు యు.లక్ష్మి మౌనిక, లంక వరప్రసాదరావు, కట్టా శ్రీనివాసు, వనుం చిన్నావతి, సంగిత సుభాష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్య సౌకర్యాలను మెరుగ్గా అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. గ్రామాల్లో అవసరమైన సదుపాయాల కల్పనకు అధునాతన భవనాలను నిర్మిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మన బడి, నాడు–నేడు పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ ఆరోగ్య సేవలను విస్తరిస్తున్నారన్నారు. గతంలోని ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించిన 104, 108 సేవలకు.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి జీవం పోశారన్నారు. ఆరోగ్యశ్రీని గాడిలో పెట్టి ప్రజలకు రూ.25 లక్షల విలువైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఆరోగ్య ఆసరా పథకం ద్వారా ఆర్థికసాయం అందజేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సుభిక్ష పాలనను తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీలు.. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన దుయ్యబట్టారు.

పారదర్శక పాలనతో అందరికీ సంక్షేమం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను చేపట్టిందని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.వందలాది కోట్ల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాకే జమచేసి, పారదర్శక పాలనను అందించామన్నారు. రూ.మూడు కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భవనాలను ఆయన ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, ఏజీపీ నామాల శ్రీనివాసు, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణ రెడ్డి, తాడి మెహర్ ఆదిత్య రెడ్డి, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, జుత్తుక శ్రీనివాస్, కోనాల పేర్రెడ్డి, వీరా రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన చెడుగుడు పోటీలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రిపబ్లిక్ డే సందర్భంగా సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు చింత కుమార్‌రాజ్ ఆధ్వర్యంలో శంకరగుప్తం నల్లివారిపేటలో జరిగిన చెడుగుడు పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తి అందరికీ ఉండాలని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి భీమవరానికి చెందిన ఫసక్ టీం, రెండో బహుమతి శంకరగుప్తానికి చెందిన చిక్ చిక్ బ్రదర్స్, మూడో బహుమతి యూత్ ఐకాన్ టీంలు సాధించాయి. విజేతలకు ఎమ్మెల్యే రాపాక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాకా ఆనందకుమార్, ఎంపీటీసీ మానుకొండ ప్రమీల, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఓగూరి హనుమంతరావు, ఉప సర్పంచ్ నాని, రామారాజులంక సీసీఎస్ సొసైటీ అధ్యక్షుడు నల్లి బాలకృష్ణ, ఎడ్ల పెద్దిరాజు, వ్యాఖ్యాత నక్క రమేష్, సునీల్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివిధాలా రాష్ట్రాభివృద్ధి

పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు



రాజులపాలెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న చిట్టిబాబు, విప్పర్తి

పి.గన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని జెడ్పీ చైర్మన్, పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. రాజులపాలెంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం వారు ప్రారంభించారు. సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని చెప్పారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మీ ప్రసాద్, మండల జేఏసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, నాయకులు నక్కా గోపి, చిన్నం నాగేశ్వరరావు, రాయుడు చిన్న, కేదాసి సత్యనారాయణ, కోరుకొండ వెంకటేశ్వరరావు, బండి అర్జునరావు, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలి

పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు



సిద్ధం పోస్టర్లను ప్రదర్శిస్తున్న పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి తదితరులు

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. అంబాజీపేట మండలానికి చెందిన పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు మండల ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీగా పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయానికి వచ్చి, విప్పర్తిని మర్యాదపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా విప్పర్తి మాట్లాడుతూ తాను ఎల్లవేళలా ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఫిబ్రవరి 3న ఏలూరు వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లి, విజయవంతం చేయాలని కోరారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి.కె.రావు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి లేదంటూ విపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, నాయకులు పేరి శ్రీనివాస్, అప్పన శ్రీను, దేవరపల్లి బాలయోగి, పల్లి రమేష్, సరెళ్ల శివశంకర్, గంటి శ్రీనివాస్, నీతిపూడి వెంకటరమణ, నెల్లి ఏడుకొండలు, నాగాబత్తుల సత్యానందం, వార చిట్టిబాబు, కడలి సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్, చింతపల్లి వెంకటేశ్వరరావు, ర్యాలీ ఒడయార్ తదితరులు పాల్గొన్నారు.

పురోహితుల క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం సాయిరాం

అంబాజీపేట: పురోహితులు, అర్చకులు, వేద పండితులు నిత్య పూజలే కాకుండా, క్రికెట్లోనూ రాణించడం అభినందనీయమని హెచ్‌ఎం కడలి సాయిరాం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో రాష్ట్రస్థాయి పురోహితుల క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నీ నిర్వాహకులు కరాబావి ఉప్రతిష్ఠ విజయ్ మహేంద్ర, గండికోట సాయి, పోచన పెద్దిఅక్షయ్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి 18, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి రెండు జట్లు పాల్గొన్నాయన్నారు. విజేతకు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.30 వేలు సెమీ ఫైనల్‌కు చేరిన జట్లకు రూ.10 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్లకు బహుమతులు ఇవ్వనున్నామన్నారు. స్థానిక క్రీడా మైదానంలో సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు క్రికెట్ టోర్నీకి హాజరైన క్రీడాకారులను హెచ్‌ఎం సాయిరాం పరిచయం చేసుకున్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల శివకోడు కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలతో పాటు, పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.లలితకుమారి బుధవారం తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరం, ఐదో తరగతిలో చేరేందుకు తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డులతో పాటు, విద్యార్థి పాస్‌పోర్టు ఫొటోతో గురుకుల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే ఈ నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి పదో తేదీ ఉదయం పది గంటలకు ఐదో తరగతి, మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికే గుర్తింపు



వీరేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా ప్రజల కోసం అంకితభావంతో పనిచేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ వీరేశ్వరరావుకు సన్మాన సభ బుధవారం జరిగింది. ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు పలువురు.. వీరేశ్వరరావు, లలిత దంపతులను, విశాఖ జిల్లాకు బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తిని సత్కరించారు. సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, జల్లి బాలరాజు కాండ్రేగుల శ్రీనివాసరావు, నాగబత్తుల శాంతకుమారి, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముతాబత్తుల ప్రశాంత్, ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ బి.మమత తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన చిర్లకు నివాళులు



మాజీ ఎమ్మెల్యే సోమసుందరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: దివంగత ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందర రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా బుధవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో ప్రముఖులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కాలువ గట్టు వద్ద ఉన్న విగ్రహానికి ఆయన కుమారుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు.

ఆత్రేయపురం: నాలుగు దశాబ్దాల రాజకీయాల్లో ఎన్నో ఆటుపోట్లు తట్టుకుని, తనదైన శైలిలో ముందుకు సాగిన దివంగత నేత చిర్ల సోమసుందర రెడ్డి వర్ధంతిని బుధవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నార్కెడ్‌మిల్లి, ర్యాలి, పులిదిండి గ్రామాల్లో చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మండలంలోని అనేక గ్రామాల్లో సోమసుందరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు.

రామేశ్వరం జట్టుకు అభినందనల వెల్లువ



సెమీఫైనల్‌లో గెలుపొందిన రామేశ్వరం వాలీబాల్ టీం

సఖినేటిపల్లి: అమలాపురంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ సెమీ ఫైనల్‌లో గెలుపొంది, ఫైనల్‌కు చేరిన రామేశ్వరం వాలీబాల్ జట్టుకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ మేరకు ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, కొందరు ప్రముఖులు అభినందనలు తెలిపారు. సెమీ ఫైనల్‌లో ఆత్రేయపురం మండలం ర్యాలీ టీంపై, రామేశ్వరం టీం విజయం సాధించింది. గురువారం జరిగే ఫైనల్‌లో రామేశ్వరం టీం ఆడుతుందని, ఇందులో విజయం సాధిస్తే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తుంది.

జగన్ పాలనలోనే రాష్ట్రంలో సంక్షేమం

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



సిరిపల్లి సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతోందని, మరోసారి సీఎంగా ఆయనను గెలిపించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం సిరిపల్లిలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, సిరిపల్లి శివాలయం వద్ద రూ.6 లక్షలతో నిర్మించిన వంతెనను, నాబార్డు నిధులు రూ.1.44 లక్షలతో నిర్మించిన ముక్తేశ్వరం జెడ్పీ స్కూల్ అదనపు తరగతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేసినట్టు గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ సంస్థలకు ధీటుగా తీర్చిదిద్దారన్నారు. గ్రామాల్లో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జేవీ కనకదుర్గ, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానం చైర్మన్ గుత్తుల నాగబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఎంపీటీసీ యడ్ల కిరణ్‌బాబు, మట్టపర్తి రామారావు, బొంతు రాజేంద్ర ప్రసాద్, మద్దింశెట్టి రాంబాబు, మిండగుదిటి రాంబాబు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

- ఎంపీపీ కేతా శ్రీనివాస్
- రాజోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా శ్రీనివాస్

రాజోలు: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ కేతా శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో రూ.20 లక్షలతో తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ అవగాహన సదస్సులు ఎందుకు నిర్వహించడం లేదని మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు సమావేశంలో ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రతి నెలా సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు ముక్తేశ్వరరావును కోరారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఎంపీపీ సూచనలు ఇచ్చారు. ఉత్తమ అవార్డులు పొందిన ఈఓపీఆర్డీ గిడ్ల భీమారావు, సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, రాజోలు పంచాయతీ కార్యదర్శి రెహమాన్, ఈఓపీఆర్డీ డీఈఓ గుబ్బల నాగార్జునను సత్కరించారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ ఎన్.బాలాజీ, డిప్యూటీ తహసీల్దారు ఎస్.శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: భవిష్యత్తులో ప్రయోజకులయ్యేందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని పూర్వ విద్యార్థుల యూనియన్ అధ్యక్షుడు యెరుబండి లక్ష్మయ్య అన్నారు. మండల స్థాయిలో జెడ్పీ స్కూలు విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు మామిడికుదురు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం రూ.27 వేల నగదు ప్రోత్సాహకాలు అందించారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కూడా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మైలవరపు రవీంద్రనాథ్, నయినాల సత్యనారాయణమూర్తి, కుడుపూడి శ్రీరామ్‌శెట్టి, నయినాల వాసు, హెచ్‌ఎం సీహెచ్ నిరంజని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిన దళితులు



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: దేవరపల్లి శివారు చెల్లిరేవుకు ప్రాంతంలో టీడీపీకి చెందిన దళితులు ఆ పార్టీని వీడి, బుధవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో వీరంతా చిర్రా నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. నవరపు ఏడుకొండలు, నవరపు మురళి, లంక సత్తిబాబు, నవరపు జ్యోతి, నవరపు వెంకటేశ్వరరావు, యార్లగడ్డ రాజు, కొడమంచిలి మురళి, చిర్రా శ్రీనివాస్, చాపల నల్లయ్య, చిర్రా వినయ్, యార్లగడ్డ ఆగస్టిన్, చల్లంగి శ్రీనివాస్, రాపాక శ్రీనివాస్, యార్లగడ్డ జాన్ తదితరులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువా వేసి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు దళిత ద్రోహి అని దుయ్యబట్టారు. దళిత బంధువైన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వెంటే తామంతా పయనించాలని నిర్ణయించుకున్నామన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో దళితులంతా జగ్గిరెడ్డి వెంటే ఉన్నారన్నారు.

డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

గ్రామంలోని ఇందిరా కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనులను బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరా కాలనీ వాసుల సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఈ డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో శిలాఫలకానికే పరిమితమైన పనిని, జగనన్న ప్రభుత్వంలో పూర్తి చేసి చూపుతున్నామన్నారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన మురుగుతో అవస్థలు పడుతున్న ఇందిరా కాలనీ వాసుల బాధ చూసి మాట ఇచ్చామని, పనులు మొదలు పెట్టి.. మాటను నిలబెట్టుకున్నామన్నారు. డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నికలు దగ్గర పడుతున్నప్పుడు హడావిడిగా శిలాఫలకం వేసి, తర్వాత పనులను రద్దు చేసిన ఘనత టీడీపీ వారికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి తదితరులు ఉన్నారు.

రైల్వే అలైన్‌మెంట్ పూర్తి చేయండి



దిండిలో రైల్వే లైన్ మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీఓ

మలికిపురం: కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ అలైన్‌మెంట్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ జి.కేశవర్ధన్ రెడ్డి అధికారులకు సూచించారు. దిండి, మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక, మట్టపర్ర గ్రామాల్లో రైల్వే లైన్ వెళ్లే భూములను ఆయన బుధవారం పరిశీలించారు. అధికారులతో కలిసి ఆయన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. తహసీల్దారు జీవీఎల్ నరసింహారావు, ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు.